సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 20 । మార్చి । 2024



పనసకు భలే గిరాకీ

ఉద్దానం పనసకు మంచి గిరాకీ నెలకొంది. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి జరుగుతోంది.


- 8లో



అంటు మొక్కలతో..

జీడిలో అంటు మొక్కలు చాలాకీలకం. దీనిపై రైతులకు అవగాహన కల్పించారు.

- 8లో



న్యూస్‌రీల్

'అడాక్స్ కోర్సులు తప్పనిసరి'

ఎచ్చెర్ల క్యాంపస్: ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా అడాక్స్ కోర్సులను ఉన్నత విద్యలో తప్పనిసరిగా అమలు చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత చెప్పారు. విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యా మండలి నిర్వహించిన వర్చువల్ సమావేశంలో వర్సిటీ అధికారులు మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్సిటీ అనుబంధ కళాశాలల్లో విద్యార్థులు అడాక్స్ ఆన్‌లైన్ కోర్సులు చదవాలని సూచించారు. డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్, ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యాకోర్సుల విద్యార్థులు ఈ కోర్సులు పూర్తి చేయాలని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాల ఆధారంగా ఈ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని చెప్పారు. అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఈ కోర్సుల నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టాలని తెలిపారు. ప్రతి విద్యార్థి ఆన్‌లైన్‌లో లాగిన్ అవ్వాలని సూచించారు. 1500 కోర్సులు అడాక్స్‌లో ఉంటాయని, విద్యార్థులు తమకు నచ్చిన కోర్సులు ఎంచుకోవచ్చని చెప్పారు. ఈ మెయిల్ ఆధారంగా ఈ నెల 21వ తేదీ లోపు విద్యార్థులు లాగిన్ అవ్వాలని అన్నారు. సమావేశంలో అడాక్స్ అడ్మిన్ డాక్టర్ జి.రామకృష్ణ, ప్లేస్ మెంట్ అధికారి విద్యాసాగర్, బీసీడీ కోఆర్డినేటర్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు శంగలరావు ఎంపిక



శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ సీనియర్స్ పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ఉంకిలి శంగలరావు ఎంపికయ్యాడు. ఈ పోటీలు మహారాష్ట్ర వేదికగా జరగనున్నాయి. ఈ మేరకు ఏపీ కబడ్డీ సంఘం నుంచి వర్తమానం అందినట్టు జిల్లా కబడ్డీ, బీచ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి సాదు శ్రీనివాసరావు తెలిపారు. శంగలరావుది శ్రీకాకుళం రూరల్ పరిధిలోని సింగుపురం గ్రామం.



బూర్జ: నరేంద్రపురంలో స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



కంచిలి: ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ

ప్రతినిత్యం.. ప్రజాక్షేత్రంలో

ప్రజా ప్రతినిధులు మళ్లీ జన క్షేత్రానికి చేరుకుంటున్నారు. సామాన్యులకు సంక్షేమ సమాచారాన్ని అందిస్తూ.. వారి యోగక్షేమాలు కనుక్కుంటున్నారు. సార్వత్రిక ఎన్నికలు ముంచుకొస్తున్న నేపథ్యంలో జనంతో మమేకమవుతున్నారు. చేసిన మంచిని వివరిస్తూ.. భవిష్యత్ కార్యాచరణను విశదీకరిస్తున్నారు.



పాతపట్నం: పాతపట్నం మార్కెట్ యార్డులో వాకింగ్ చేస్తున్న వారితో మాట్లాడుతున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుమారులు శ్రావణ్, ఓంశ్రీకృష్ణ



ఎచ్చెర్ల క్యాంపస్: పూడివలసలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మహిళలతో మాట్లాడుతున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సతీమణి పరిమళ

రెండో రోజు 446 మంది గైర్హాజరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో రెండో రోజు మంగళవారం పదో తరగతి పరీక్షలకు 446 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 145 కేంద్రాల్లో జరుగుతున్న ఈ పరీక్షల్లో రెండో రోజు హిందీ పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా 29,108 మంది హాజరుకావాల్సి ఉండగా 28,662 మంది హాజరయ్యారు. ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 33 కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు చేశాయి. అలాగే జిల్లా పరిశీలకులు 8 కేంద్రాల్లో, డీఈఓ కె.వెంకటేశ్వరరావు 5 కేంద్రాలు, అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్ 6 కేంద్రాల్లో తనిఖీలు చేశారు. అధికారులు, స్క్వాడ్ బృందాలు కలిపి మొత్తం 52 కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రెండోరోజు ఎలాంటి మాల్‌ప్రాక్టీసులు నమోదుకాలేదని డీఈఓ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు.



శ్రీకాకుళం క్రైమ్: కేశవరెడ్డి స్కూల్‌ను సందర్శించిన ఎస్పీ రాధిక

ఎన్నికల కోడ్ అమలుపై వీడియో కాన్ఫరెన్స్

శ్రీకాకుళం పాతబస్టాండ్ : ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలుచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లను ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలుపై మంగళవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రచారాలకు ప్రభుత్వ స్థలాలు అనుమతించరాదని, రాజకీయ పార్టీలకు అనుమతులివ్వడంలో నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. సమావేశంలో కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్, జేసీ ఎం.నవీన్, సబ్ కలెక్టర్ నూర్ కమల్ పాల్గొన్నారు.

2024 సమరం సన్నద్ధం

సోషల్ మీడియా పోస్టింగ్‌లపై పోలీసుల కన్ను

సోషల్ మీడియాలో వ్యక్తులు చేసే వివాదాస్పద పోస్టింగ్‌లపై జిల్లా పోలీసులు డేగ కన్ను వేస్తున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు జిల్లా సైబర్, సోషల్ మీడియా విభాగం పోలీసులు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా జిల్లాలో ఉన్న ఎనిమిది నియోజకవర్గాల పరిధి పట్టణాలు, మండలాలు, గ్రామాల్లోని గ్రూపుల్లో ఇష్టానుసారంగా పోస్టులు పెట్టినా, రాజకీయ పార్టీలకు సంబంధించి భావోద్వేగాలను రెచ్చగొట్టినా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రూప్‌లకు అడ్మిన్‌గా ఉన్నవారు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. -శ్రీకాకుళం క్రైమ్

ఓటే మన ఆయుధం



ఓటు హక్కు వినియోగంపై అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వజ్రాయుధం వంటిదని చాటి చెప్పారు. ఆమదాలవలస మండలంలోని వెదుళ్లవలసలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. - ఆమదాలవలస రూరల్

కలెక్టర్ సుడిగాలి పర్యటన

ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా చూసుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులకు సూచించారు. ఆయన మంగళవారం రణస్థలం, లావేరు మండలాల్లో పర్యటించారు. రణస్థలం తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల వివరాలు, ఇతర రికార్డులు పరిశీలించారు. తర్వాత పైడిభీమవరంలో అంతర్‌జిల్లా చెక్‌పోస్టును పరిశీలించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాకే విడిచి పెట్టాలని సూచించారు. సీసీ కెమెరాలు పెట్టాలన్నారు. కోష్ట ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ఫ్లయింగ్ స్క్వాడ్ విధులపై ఆరా తీశారు. పల్లిపేట గ్రామంలో 182, 183 మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి బీఎల్‌ఓలతో మాట్లాడారు. అనంతరం లావేరు మండలంలోని వెంకటాపురం గ్రామాన్ని పరిశీలించి జిల్లా సరిహద్దు గ్రామం కాబట్టి చెక్ పోస్టును త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సమస్యాత్మక పోలింగ్ కేంద్రమైన 84,85 అప్పాపురం పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి ఒకవైపు వర్గానికి అధిక శాతం ఓట్లు పడటంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఆర్వో ఎస్వీ లక్ష్మణమూర్తి, సీఐ జి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. - రణస్థలం



పల్లిపేటలో మోడల్ పోలింగ్ కేంద్రం(183)లో సౌకర్యాలపై స్థానిక బీఎల్‌ఓతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్

ఆ ఒక్కటీ.. ఇంకా తేలదేమిటీ!

జిల్లా మిత్రపక్షాల్లో ఒకటే టెన్షన్

- పొత్తులో కేటాయించే సీటుపై గందరగోళం
- ఎచ్చెర్ల, పాతపట్నంలో ఏదో ఒకటి కావచ్చన్న అభిప్రాయం
- సీటు కేటాయింపులో స్పష్టత లేమి



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: కూటమిలో సీట్ల పంపకంపై స్పష్టత కుదరడం లేదు. టీడీపీ, జనసేనలోనే కాదు బీజేపీలో కూడా టెన్షన్ నెలకొంది. శ్రీకాకుళం జిల్లాలో కేటాయించే సీటు విషయంలో ఇప్పటికీ ఓ క్లారిటీ లేకపోవడంతో బీజేపీ నాయకుల్లో అయోమయం వీడడం లేదు. చంద్రబాబు, పవన్‌తో జరిగిన సమావేశంలో జాతీయ స్థాయి నాయకులు పాల్గొనడం, అందులో రాష్ట్ర నాయకులు లేకపోవడంతో బీజేపీకి కేటాయించే సీటుపై గందరగోళం నెలకొంది. ఇప్పుడున్న సమాచారం మేరకు శ్రీకాకుళం కంటే పాతపట్నం, ఎచ్చెర్ల నియోజకవర్గాలకే ఎక్కువ అవకాశం ఉన్నట్టుగా బీజేపీ నాయకులు అభిప్రాయడుతున్నారు.

పొత్తు కుదరకముందు ప్రతి నియోజకవర్గానికి ముగ్గురేసి అభ్యర్థులను రాష్ట్ర నాయకులు జాతీయ అధిష్టానానికి ప్రతిపాదించారు. ఈ లోగా పొత్తు కుదరడంతో సీట్ల పంపకాలపై పార్టీ దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా శ్రీకాకుళం జిల్లాకు ఒక సీటు ఇవ్వాలని ఒప్పందం జరిగింది. ఇక్కడే కాస్త సమాచారం లోపం నెలకొన్నట్టుగా తెలుస్తోంది. జిల్లాలో ఒక సీటు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ ఒక్కటీ శ్రీకాకుళం కావచ్చని చాలారోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. కానీ తాజాగా బీజేపీ వర్గాల సమాచారం ప్రకారం జిల్లాకు ఒకటి అన్నది శ్రీకాకుళం పేరు మీద జరిగినందున.. అది శ్రీకాకుళం నియోజకవర్గం అయి ఉండొచ్చనే ప్రచారానికి తెరలేచినట్టుగా భావిస్తున్నారు. అదే జరిగితే శ్రీకాకుళం నుంచి ప్రతిపాదిత జాబితాలో ఉన్న పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాల్‌తో పాటు రాయలసీమ జిల్లాకు చెందిన సురేంద్రకుమార్‌లలో ఎవరికో ఒకరికి ఇవ్వవచ్చని ఊహాగానాలు, విశ్లేషణలు జరిగిపోయాయి.

తాజా సమాచారం ప్రకారం ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాలకే ఎక్కువ అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. పాతపట్నంలో టీడీపీలో ఉన్న గ్రూపు రాజకీయాలతో ఆ పార్టీ భ్రష్టు పట్టి పోవడంతో ఎందుకొచ్చిన సమస్య అని బీజేపీకి ఇచ్చేస్తే సరిపోతుంది కదా అని చంద్రబాబు ఆలోచన చేస్తున్నట్లు భోగట్టా. అలాగే ఎచ్చెర్లలో కిమిడి కళా వెంకటరావు, కలిశెట్టి అప్పలనాయుడు మధ్య పోటీ తీవ్రంగా ఉండటంతో బీజేపీకి ఇచ్చేస్తే తలనొప్పి ఉండదని కూడా చంద్రబాబు భావించి ఉండొచ్చని.. ఈ రెండింటిలో బీజేపీ ఏది కోరితే ఆ సీటు ఇచ్చేయడానికి చంద్రబాబు సిద్ధంగా ఉన్నట్టు కూడా బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర పార్టీ అభిప్రాయం మేరకు ఈ రెండింటిలో ఏదో ఒక నియోజకవర్గాన్ని జాతీయ నాయకత్వం ఖరారు చేసే అవకాశం ఉందని జిల్లా నాయకత్వం కూడా భావిస్తోంది. వాస్తవంగా ఇటీవల బీజేపీలో చేరిన ఒకప్పటి టీడీపీ నాయకుడు సిరిపురం తేజేశ్వరరావు ఆ వ్యూహంలో భాగమని బీజేపీ శ్రేణులు చెబుతున్నాయి. ఒకవేళ పాతపట్నం కాదనుకుంటే ఎచ్చెర్లకు చెందిన ఎన్ఈఆర్(నడికుదిటి ఈశ్వరరావు)కైనా ఖరారు కావచ్చని తెలుస్తోంది. ఎన్ఈఆర్ కోసం పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పెద్ద ఎత్తున ప్రయత్నిస్తున్నట్టుగా ఓ వర్గం చెబుతుండగా, టిక్కెట్ గ్యారంటీ ఇవ్వడంతోనే సిరిపురం తేజేశ్వరరావు పార్టీలోకి చేరారని మరోవర్గం స్పష్టం చేస్తోంది.

మొత్తానికి బీజేపీకి జిల్లాలో ఒక సీటు కేటాయించడం ఖాయం. అది ఏది అన్నది తేలాల్సి ఉంది. కమ్యూనికేషన్ గ్యాప్‌తో తెరపైకి వచ్చిన శ్రీకాకుళం అవుతుందా? కాస్త బలంగా ఉన్నామని భావిస్తున్న ఎచ్చెర్ల, పాతపట్నంలో ఒకటవుతుందా అన్నది చూడాల్సి ఉంది. బీజేపీలో జరుగుతున్న తర్జనభర్జన నేపథ్యంలో టీడీపీ నాయకులకు చెమటలు పడుతున్నాయి. బీజేపీతో తమ సీటు గల్లంతు అవుతుందేమోనని అటు శ్రీకాకుళం నుంచి గుండ లక్ష్మీదేవి, గొండు శంకర్, పాతపట్నం నుంచి కలమట వెంకటరమణ, మామిడి గోవిందరావు, ఎచ్చెర్ల నుంచి కళా వెంకటరావు, కలిశెట్టి అప్పలనాయుడు భయాందోళనలో ఉన్నారు. మొత్తానికి ఏదో ఒక నియోజకవర్గంలో ఇద్దరికీ సీటు చిరగడం మాత్రం ఖాయమని పొత్తు ఒప్పందం ప్రకారం స్పష్టమవుతోంది.

పొలిటికల్ పాయింట్

సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాధారణ ఎన్నికల నిర్వహణలో అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సూచించారు. ఆర్ఓలు, ఈఆర్ఓలు, నోడల్ అధికారులు, ప్రత్యేకాధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సి-విజల్, సువిధ, ఎంసీసీ తదితర అంశాల్లో నిబంధనలు పాటించాలని తెలిపారు. ఆయా విభాగాలకు సంబంధించిన అంశాలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. పరిశీలన, తనిఖీలు ఎప్పటికప్పుడు చేయాలన్నారు. ప్రతి టీముకూ ఇతర టీములతో సంబంధాలు కలిగి ఉండి సమన్వయంతో పనిచేయాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల ఖర్చులు, ర్యాలీలు, సభలు, సమావేశాలు, ప్రకటనలు, బ్యానర్ల అనుమతులు వంటి ఖర్చులు లెక్క వేయడం, నాయకుల ఉపన్యాసాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, వీడియోవింగ్‌లు గుర్తించి ఎంసీసీ, మోడల్‌కోడ్‌ను ప్రతిరోజూ 24 గంటలూ గమనించాలన్నారు. వివిధ పత్రికల్లో వచ్చే ప్రకటనలు, పెయిడ్ ఆర్టికల్స్, సినిమా థియేటర్లు, స్థానిక కేబుళ్లు, టీవీల్లో వచ్చే ప్రకటనల్లో కూడా నివేదికలు తయారుచేయాలన్నారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, ప్రతిరోజూ ఈసీకి నివేదికలు పంపించాలని చెప్పారు.

క్లుప్తంగా

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పర్లాకిమిడి: స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని డీన్ ఇన్‌చార్జి డాక్టర్ ప్రఫుల్ల పండా, డీన్ స్టూడెంట్స్ డా.రితీష్ కుమార్, కో–ఆర్డినేటర్ డా.ప్రజ్ఞాపాణిలు ప్రారంభించారు. మొత్తం 111 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. జిల్లా బ్లడ్ బ్యాంక్ సీనియర్ ఫార్మసిస్టు ఖగేశ్వర బెహరా, ఇతర టెక్నీషియన్లు సహకారం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల కో–ఆర్డినేటర్ సుశాంత కుమార్ పట్నాయిక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.శుభ్రమయ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం అలవరుచుకోవాలి



కలెక్టర్‌కు ఎల్ఈడీ లైట్లు అందజేస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రతిఒక్కరూ సేవాభావం అలవరుచుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. జిల్లావ్యాప్తంగా మురికివాడల్లో వెలుగులు నింపేందుకు లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ముందడుగు వేసింది. ఇందులో భాగంగా 150 ఎల్ఈడీ లైట్లు కొనుగోలు చేసి మంగళవారం కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్, క్లబ్ జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, ప్రధాన కార్యదర్శి టి.రాంగోపాల్, సెక్రటరీ శిల్లా మణి తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ కోర్సులో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణా కేంద్రంలో ఏర్పాటుచేసిన స్కిల్‌హబ్‌లో సూయింగ్ మెషీన్ ఆపరేటర్ (టైలరింగ్)లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్ మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలలపాటు అందించే టైలరింగ్ స్వల్పకాలిక కోర్సు శిక్షణకు 5వ తరగతి ఉత్తీర్ణులైన మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 23తో దరఖాస్తుల గడువు ముగుస్తుందన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు బయేడేటా, విద్యార్హతలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌ఫొటోలతో బలగ హాస్పటల్ జంక్షన్‌లోని డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణా సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 70957 31303 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

●ఆనందం



ఉక్కపోత, ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలు మంగళవారం కురిసిన వర్షంతో కాస్త ఉపశమనం పొందారు. పాతపట్నం, ఎల్.ఎన్.పేట, సారవకోట తదితర మండలాల్లో మధ్యాహ్నం సుమారు మూడు గంటల పాటు ఉరుములు, గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పొలాల్లో నీరు నిలిచిపోయింది. నువ్వు వంటి వాణిజ్య పంటలకు ఈ వర్షం మేలు చేసిందని రైతులు చెబుతున్నారు.

– పాతపట్నం/సారవకోట/ఎల్.ఎన్.పేట /శ్రీకాకుళం పాతబస్టాండ్

●ఆచారం



ఇచ్ఛాపురం పట్టణంలోని డబ్బూరి వీధిలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా జలయాత్రను భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. బాహుదానది నుంచి భక్తులు జలయాత్ర చేపట్టారు. అనంతరం విగ్రహానికి ప్రతిష్ఠాసంకల్పం, పుణ్యాహవాచనం, పంచగవ్యసాధన, రుత్విక్ వరుణ, మండపార్చన, రుద్రపారాయణం, హోమ పూజలు చేశారు. రెండు రోజులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు.

– ఇచ్ఛాపురం

●ఆహారం



శ్రీకాకుళంనగరంలోని జీటీ రోడ్డులో ఉన్న జామియా మసీదులో రంజాన్ మాసం సందర్భంగా మంగళవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశా. ముస్లింలు పాల్గొని ముందుగా ప్రత్యేక రంజాన్ ప్రార్థనలు చేశారు. ప్రతిఒక్కరికీ మంచి జరగాలని దైవాన్ని కోరుకున్నారు. శాంతి సౌభ్రాతృత్వాలతో మెలగాలన్నారు. అనంతరం సాయంత్రం ఇఫ్తార్ విందు ఆరగించారు.

– శ్రీకాకుళం కల్చరల్

పైడితల్లీ పాహిమాం!

● పోలిపల్లి పైడితల్లి జాతరకు పోటెత్తిన భక్తులు
● సేవల్లో నిమగ్నమైన స్వచ్ఛంద సంస్థలు



తల్లీ కరుణించు..



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రాజాం సిటీ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర మంగళవారం కనుల పండువగా జరిగింది. మూడు రోజులుగా కొనసాగుతున్న ఈ జాతరకు మూడో రోజు మంగళవారం తెల్లవారు జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించారు. అమ్మవారి ఆలయం వద్ద వేపచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వెనుక భాగంలో పలువురు తలనీలాలు సమర్పించారు. భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు సేవలందించాయి. మంచినీరు, మజ్జిగ, అల్పాహారం, పులిహోర ప్యాకెట్లను పంపిణీచేశాయి. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, వాసవీక్లబ్ మన రాజాం–సారథి, సత్యసాయి సేవాదళ్ తదితర స్వచ్ఛంద సంస్థలు యాత్రికులకు అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేశాయి.



అమ్మవారి వేపచెట్టు వద్ద భక్తుల తొలిపూజ

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు..

పోలిపల్లి పైడితల్లి అమ్మవారిని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. జాతర ఏర్పాట్లపై ఈఓ మాధవరావుతో పాటు సీఐ మోహనరావును అడిగి తెలుసుకున్నారు.

జాతర ముగింపు ఇలా...

ఆలయం వద్ద శుక్రవారం జరిగిన నేత్రోత్సవం అనంతరం అమ్మవారి గర్భగుడి నుంచి తీసుకువెళ్లిన ప్రతిమలను మంగళవారం అర్ధరాత్రి తిరిగి ఆలయానికి చేర్చడంతో జాతర ముగుస్తుంది. కొండంపేటలోని లంకలపల్లి కుటుంబీకుల ఇంటి వద్ద నుంచి ఘటాలతో అమ్మవారి గుడికి చేరుకోవడంతో జాతర ముగుస్తుంది. దీనిని పురస్కరించుకొని అర్ధరాత్రి సమయంలో కనులు మిరుమిట్లు గొలిపే బాణాసంచా భక్తులను ఆకట్టుకుంది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.



అమ్మవారి జాతరలో సేవలందించేందుకు వచ్చిన స్కౌట్ క్యాడెట్లు

27 నుంచి జాతీయస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సుమిత్రా కళాసమితి సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్ : ప్రపంచ రంగస్థల దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 27 నుంచి 30 వరకు జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సుమిత్రా కళా సమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. నగరంలోని అవోపా కల్యాణ మండపంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా జాతీయ ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గురజాడ అప్పారావు రచించిన 125 ఏళ్లనాటి కన్యాశుల్కం నాటకాన్ని ఈ నెల 27న ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ నాటకానికి టికెట్ రుసుం రూ.50గా నిర్ణయించామన్నారు. నాటకం అనంతరం కళాకారులకు అభినందన సత్కారాలు ఉంటాయన్నారు. 28న కొలకలూరు, సాయిఆర్ట్స్ వారిచే 'కౌసల్యా సుప్రజా రామా' నాటిక, కాకినాడ, సాయి కార్తీక్ క్రియేషన్స్ వారి 'ఎడారిలో వాన చినుకు' నాటికలు ప్రదర్శిస్తామని తెలిపారు. 29న హైదరాబాద్‌కు చెందిన గోవాడా క్రియేషన్స్ వారిచే 'మూల్యం' నాటిక, కాకినాడ శృంగార వల్లభ ఆర్ట్స్ వారిచే 'కబ్జా' నాటిక, 30న గుంటూరు వారి అభియన ఆర్ట్స్ వారిచే 'ఇంద్రప్రస్థం' నాటిక, కొప్పోలుకు చెందిన పండు క్రియేషన్స్ వారిచే 'పక్కింటి మొగుడు' నాటిక ప్రదర్శన జరుగుతాయని చెప్పారు. సమావేశంలో సమితి కార్యదర్శి గుత్తు చిన్నారావు, కోశాధికారి నక్క శంకరరావు, ఉపాధ్యక్షులు మండవిల్లి రవి, కిల్లాన ఫల్గుణరావు, తిమ్మరాజు నీరజ, మెట్ట పోలినాయుడు, కొమనాపల్లి సురేష్, బంకుపల్లి శంకరం, ఎం.వరలక్ష్మి, యు.పూజ పాల్గొన్నారు.

అంటుజీడి మొక్కలతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న రీసెర్చ్ డైరెక్టర్ ఎల్.నారంనాయుడు

పలాస: జిల్లాలో, ముఖ్యంగా ఉద్దానం ప్రాంతంలో పిక్క ద్వారా వచ్చే మొక్కలే నేడు అత్యధికంగా ఉన్నాయని, వాటి స్థానంలో అంటుజీడి మామిడి మొక్కలు నాటితే అధిక దిగుబడులు వస్తాయని వైఎస్సార్ ఉద్యాన వన యూనివర్శిటీ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టరు ఎల్.నారంనాయుడు చెప్పారు. పలాస కాష్యూ మానిఫేక్చరర్స్ అసోసియేషన్ హాలులో మంగళవారం వైఎస్సార్ ఉద్యానవన వర్సిటీ శాస్త్రవేత్తలతో జీడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం బారువలో ఉద్యానవన శాఖాధికారిగా తాను పని చేశానని గుర్తు చేశారు. అప్పటికీ ఇప్పటికీ జీడి సాగులో పెద్దగా మార్పులు లేవన్నారు. గతం కన్నా జీడి పరిశ్రమలు పెరిగాయని, ముడిసరుకుగా ఉన్న జీడి పిక్కల ఉత్పత్తిలో దిగుబడులు పెరగలేదన్నారు. పలాస కేంద్రంగా 420 పరిశ్రమలు ఉన్నాయని చెప్పారు. జిల్లాలోని ఉద్దానం ప్రాంతంలో మొత్తం 2400 హెక్టార్లలో జీడి మామిడి సాగవుతోందన్నారు. ఇక్కడి పరిశ్రమలకు ఏడాదికి 64 లక్షల మెట్రిక్ టన్నుల జీడి పిక్కలు అవసరం కాగా, ఈ ప్రాంతం నుంచి కేవలం 16,800 టన్నులు పిక్కలే ఉత్పత్తి అవుతున్నాయని, దీంతో ఇతర దేశాల పిక్కలపై ఆధార పడాల్సి వస్తుందని చెప్పారు. ఒకప్పుడు ప్రపంచంలో భారతదేశం నంబర్ వన్‌గా ఉండేదని గుర్తు చేశారు. గతంలో మన జీడి పప్పు ఇతర దేశాలకు ఎగుమతి అయ్యేదని, ఇప్పుడు మన దేశ అవసరాలకే సరిపోవడం లేదని, ఇక్కడ ధరలు కూడా బాగున్నాయన్నారు. ప్రపంచ విస్తీర్ణంలో మనది 20 శాతం కాగా ఉత్పత్తి 15శాతం ఉందన్నారు. మన దేశంలో 7.82లక్షల హెక్టార్లలో జీడి పంట సాగవుతుందని, దీని వల్ల 7.82 లక్షల టన్నుల జీడి పిక్కలు ఉత్పత్తి అవుతున్నాయని వివరించారు. మన దేశానికి వియత్నాం గట్టి పోటీగా ఉందని, ఇతర దేశాల నుంచి ముడి సరుకు దిగుమతి చేసుకోవడం వల్ల మన రెవెన్యూ లక్షల కోట్లలో ఇతర దేశాలకు వెళ్తోందని చెప్పారు. జీడి విస్తీర్ణంతో పాటు దిగుబడులు పెంచుకోవాలని, అందుకు ప్రభుత్వం సహాయం అందిస్తుందని చెప్పారు. సమావేశంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.బి.వి.చలపతిరావు, డాక్టర్ బి.వి.కె.భగవాన్, డాక్టర్ వి.హరికుమార్, జిల్లా ఉద్యాన వన శాఖాధికారి ఆర్.వి.వి.ప్రసాద్, హెచ్ఓలు కె.సునీత, శంకర్‌దాస్, ఏపీ జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, ఉద్దానం రైతులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



బాలుకు చెక్ అందిస్తున్న మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాసకు చెందిన కిల్లంశెట్టి పార్వతి అనారోగ్యం బారిన పడటంతో శ్రీకాకుళంలోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స కోసం రూ.4 లక్షల వరకు ఖర్చు చేశారు. హెల్త్‌కార్డు సైతం రిజెక్టు కావడంతో కుటుంబ సభ్యులు ఈ నెల 10న మంత్రి సీదిరి అప్పలరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రి నిర్వాహకులతో మాట్లాడి రూ.లక్షా యాభై వేలు తగ్గించేలా చేశారు. దీంతో పాటు, రూ.85 వేల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు. ఈ చెక్‌ను మంగళవారం పార్వతి కుమారుడు బాలుకు అందించారు. కార్యక్రమంలో కాశీబుగ్గ వైశ్యసంఘం యువజన అధ్యక్షులు కోట్ని విజయ, నాయకులు పెంట రత్నాకర్ పాల్గొన్నారు.

బార్ ఎన్నికలకు ముగిసిన నామినేషన్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ గడువు ముగిసింది. మంగళవారం చివరిరోజు కావడంతో అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. అధ్యక్ష పోస్టు మొదలుకొని అన్ని విభాగాలకు ఈసారి పోటీ నెలకొంది. అధ్యక్ష పదవికి సిటింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్ని సూర్యారావు, గత ఏడాది పోటీ చేసిన కూన రాజారావు, కొత్తగా కిలారి ఈశ్వరరావు పోటీ పడుతున్నారు. మిగిలిన వాటికి రెండు, మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. కాగా, అధ్యక్ష పదవికి ఎన్ని సూర్యారావు, ప్రధాన కార్యదర్శి పదవికి గురుగుబెల్లి అప్పలనాయుడు నామినేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న ఎన్ని సూర్యారావు

దాడి కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష

సోంపేట : దాడి కేసులో సోంపేట పట్టణానికి చెందిన నర్సు జోగారావుకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ శ్రీకాకుళం జిల్లా 4వ అదనపు న్యాయమూర్తి (ఎస్సీ, ఎస్టీ) ఎస్.ఎం.ఫణికుమార్ మంగళవారం తీర్పు నిచ్చారు. పట్టణంలోని జలంత్ర జాలరీ వీధిలో నివసిస్తున్న పట్ట బాలరాజుతో పెయింటింగ్ కాంట్రాక్ట్ విషయంలో జరిగిన గొడవలో 2017 నవంబర్ 18న జోగారావు కత్తితో దాడి చేశాడు. అప్పట్లో కేసు నమోదు కాగా.. నేరం రుజువు కావడంతో తీర్పు వెల్లడైంది.

అర్ధరాత్రి వాహన తనిఖీలు



అర్ధరాత్రి సమయంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. టెక్కలి పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి సమయంలో పోలీసులు వాహన తనిఖీలు చేశారు. స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద ఏఎస్ఐ కేశవరావు ఆధ్వర్యంలో సుమారు 20 మంది ఆర్ఎస్‌పీఎఫ్ కానిస్టేబుళ్లు వచ్చిపోయే వాహనాలను నిశితంగా పరిశీలించారు.

ఉద్దానం పనసకు భలే గిరాకీ



లారీల్లో పనసకాయలను లోడ్ చేస్తున్న కార్మికులు



ఉద్దానం రైతుల నుంచి కొనుగోలు చేసిన పనసకాయలు

ఇచ్ఛాపురం రూరల్:

ఉద్దానం పనస ఇతర రాష్ట్రాలకు పయనమవుతోంది. ప్రస్తుతం పనస కాయలు పిందె స్థాయిలో ఉండటంతో కూరలకు అనుకూలంగా ఉండటంతో వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. పనస ముక్కలతో బిర్యానీ, పొట్టుకూర, హల్వా, పకోడీ, పనస గింజల కూర, గూనచారు, కుర్మా, పచ్చడి వంటి వివిధ వంటకాలకు ఉపయోగిస్తున్నందున ఉద్దానం పనసకు గిరాకీ పెరుగుతోంది. నేరుగా వ్యాపారులు రైతుల వద్దకు వెళ్లి కేజీ పనస కాయ ధర రూ.13 కొనుగోలు చేస్తూ రెండు, మూడు రూపాయలకు అదనంగా బరంపురం, కటక్, కుర్ధా, గుజరాత్, కోల్‌కత్తా, ముంబై వంటి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు. కాగా, పదిహేను రోజుల ముందు వరకు పాతిక రూపాయలు వరకు ధర పలికే కేజీ పనస పిందెలు ధర గత రెండు రోజుల నుంచి భారీగా ధర పడిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు, గాలులు, ప్రకృతి వైపరీత్యాలకు పనస పిందెలు నేలరాకుండా ముందస్తు జాగ్రత్తగా వీటిని అమ్మకాలు చేస్తున్నామని రైతులు చెబుతున్నారు.